

హోరెత్తిన నిమజ్జనం





క్రేన్ సాయంతో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం





వినాయక ఘాట్ వద్ద విగ్రహాలు



నిమజ్జనానికి తరలివస్తున్న వినాయకుడు



వినాయక ఘాట్ పరిసర ప్రాంతాల్లో భక్తుల సందడి





గంగ ఒడిని చేరు గణనాథుడు



- 2 వేలకు పైగా విగ్రహాలు నిమజ్జనం
- డీజేల హోరు.. యువత జోరు..
- ముగిసిన గణేశ్ ఉత్సవాలు

వెళ్లి రావయ్యా గణపయ్య.. మళ్లీ రావయ్యా లంబోదరా అంటూ కర్నూలులో గణేశ్ నిమజ్జనం కోలాహలంగా సాగింది. ప్రజలు వేలాదిగా రోడ్లపైకి రావడంతో కర్నూలు కాషాయమయంగా మారింది. భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి వినాయక విగ్రహాలను గంగమ్మ ఒడికి సాగనంపారు. 9 రోజుల పాటు అశేష భక్తుల పూజలందుకున్న గణనాథుల నిమజ్జనం కర్నూలులో ఘనంగా పూర్తయింది. నగరంలో శోభాయాత్ర ఆద్యంతం కనులవిందుగా సాగింది. వినాయక విగ్రహాలకు భక్తులు నీరాజనం పలికారు. డీజే పాటలు.. డప్పు దరువులు, ఆట పాటలు, బాణసంచా మోతలతో నగర వీధులన్నీ హోరెత్తాయి. ఈ సందర్భంగా సాగిన శోభాయాత్రలో చిన్నారుల నుంచి పెద్దల వరకు భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. సామూహికంగా నృత్యాలు చేస్తూ.. రంగులు చల్లుకుంటూ గణనాథుడిని సందడిగా ఊరేగించారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో భారీగా అన్నదానాలు చేశారు. కర్నూలు నగర వ్యాప్తంగా ఉన్న రెండు వేలకు పైగా విగ్రహాలు వినాయక ఘాట్ సమీపంలోని కేసీ కెనాల్‌లో నిమజ్జనం నిర్వహించారు. దీంతో జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై.. గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలతో కర్నూలు మార్మోగింది. గురువారం ఉదయం మొదలైన నిమజ్జనోత్సవం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కొనసాగింది.

-కర్నూలు కల్చరల్/ కర్నూలు న్యూసిటీ

వివరాలు 4లో.





ఘాట్ వద్ద నిమజ్జనాన్ని తిలకిస్తున్న భక్తులు



నిమజ్జనానికి సిద్ధంగా గణనాథులు



గంగాహారతి ఇస్తున్న అర్చకులు

డ్రోన్‌తో ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థను రూపొందించాలి : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థను రూపొందించాలని కలెక్టర్ రంజిత్‌బాషా పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయంలో ట్రిపుల్ ఐటీడీఎం ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థకు సంబంధించిన ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తక్షణ వైద్య సదుపాయం అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కె.కృష్ణనాయక్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ రవికుమార్, రాయలసీమ వర్సిటీ ప్రొఫెసర్ ఖాసిఫా అంజుమ్, విద్యార్థులు పాల్గొన్నారు.



డ్రోన్ ప్రదర్శనను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

జిల్లా స్థాయి ఉత్తమ గురువుల ఎంపిక

- 30 మంది ఉపాధ్యాయులు, 14 మంది అధ్యాపకులకు అవార్డులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శాఖలో ఉత్తమ సేవలు అందించిన 30 మందిని ఉపాధ్యాయులను ఉత్త మ అవార్డుకు ఎంపిక చేశారు. ఉపాధ్యాయులు విద్యతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో చేసిన సేవల ను గుర్తించి వారిని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేశారు. అలాగే జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు ఆధ్వర్యంలో ప్రభుత్వ జూని యర్ కళాశాలల్లో ఉత్తమ సేవలు అందించిన 14 మంది అధ్యాప కులను గుర్తించి జిల్లా స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపిక చేశారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన వారికి కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడి టోరియంలో ఉదయం 10 గంటలకు రాష్ట్ర పరిశ్రమల, వాణి జ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదుగా ఉత్తమ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు డీఈవో శామ్యూల్‌పాల్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, ప్ర జాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

పీపీపీ విధానంలో ఆదోని వైద్య కళాశాల నిర్వహణ

- ప్రభుత్వం కీలక నిర్ణయం.. మంత్రివర్గం ఆమోదం
- వచ్చే ఏడాది నుంచి ప్రవేశాలకు అవకాశం

కర్నూలు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ దశల్లో ఆగిపోయిన వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ - పీపీపీ) విధానంలో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం పది కాలేజీలను ఈ విధానం కిందకు తీసుకురాగా అందులో ఆదోని వైద్య కళాశాల ఒకటి. గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం భేటీలో తొలి దశలో ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందులు మెడికల్ కాలేజీల అభివృద్ధి, ఆర్ఎఫ్‌పీ ముసాయిదా, రాయితీ ఒప్పందాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదోని మెడికల్ కాలేజీ పనులు త్వరలోనే పునఃప్రారంభం అయ్యే అకాశం ఉంది. అదే జరిగితే 2026-27 విద్యా సంవత్సరం నుంచి వైద్య విద్యార్థుల ప్రవేశాలకు అవకాశాలు ఉంటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కళాశాలు నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అందు లో ఆదోని మెడికల్ కాలేజీ ఒకటి. 420 పడకల సామర్థ్యం గల బోధనాస్పత్రి ఇది. 2024-25 విద్యా సంవత్సరంలో వైద్య విద్యా తరగతులు ప్రారంభిస్తామంటూ ఆర్భాటం చేశారు. నాబార్డు రుణం రూ.475 కోట్లతో నిర్మాణాలు మొదలు పెట్టారు. 13.31 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో టీచింగ్ హాస్పిటల్, మెడికల్ కాలేజీ, రెసిడెన్సియల్ స్టాఫ్ క్వార్టర్స్, నర్సింగ్ కాలేజీ, విద్యార్థుల వసతి గృహాలు, జూనియర్, సీనియర్ రెసిడెన్స్ హాస్టల్, నర్సింగ్ విద్యార్థుల వసతి గృహం తదితర పనులను రూ.350 కోట్లతో చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) పర్యవేక్షణలో విజయవాడకు చెందిన కాంట్రాక్ట్ సంస్థ కేఎంవీ గ్రూప్ సంస్థ పనులు మొదలు పెట్టింది. నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆదోని వైద్య కళాశాలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

కరువు పల్లెల్లో పవన విద్యుత్ ప్రాజెక్టు

పత్తికొండ, తుగ్గలి, దేవనకొండ, ఆస్పరి మండలాల్లో 300 మెగా వాట్ల పవన విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024లో భాగంగా మెస్సర్స్ సెరెంటికా రెన్యూవబుల్స్ ఇండియా సంస్థకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకుంది.



అసంపూర్తిగా ఆదోని మెడికల్ కాలేజీ వివిధ విభాగాల భవనాలు



మంత్రివర్గం ఆమోదంతో చిగురించిన ఆశలు

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో మెడికల్ కాలేజీలు నిర్వహిస్తున్న ఉత్తరప్రదేశ్ (యూపీ), గుజరాత్ రాష్ట్రాల్లో పర్యటించి ఎలా నిర్వహిస్తున్నారో రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేయించినట్లు తెలుస్తుంది. కళాశాలను ప్రారంభించాక ఓపీ, ఐపీ అంచనాలు, రోగ నిర్ధారణ పరీక్షల యంత్రాలు, పరికరాల కొనుగోళ్లకు అయ్యే వ్యయం, వైద్యసీట్లు ద్వారా వచ్చే ఆదాయం, వైద్యుల జీతభత్యాలు, నిర్వహణ ఖర్చులు.. ఇలా సమగ్ర వివరాలతో ఇచ్చిన అధారంగా పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీ నిర్వహించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. త్వరలోనే టెండర్లు నిర్వహించి కళాశాల నిర్వహణ సంస్థను ఎంపిక చేసే అవకాశం ఉంది. దీంతో త్వరలోనే ఆదోని వైద్య కళాశాల నిర్మాణ పనులు మొదలయ్యే అవకాశం ఉంది.

కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హత మారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- » కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- » ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- » తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- » తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- » సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాథిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో అర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో అర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

నంద్యాల జిల్లాకు పవర్

- పవర్‌ప్రాజెక్టులకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్
- కొలిమిగుండ్ల, అవుకులో ఏర్పాటుకు నిర్ణయం
- సుమారు రూ.1500 కోట్ల పెట్టుబడులు


మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

నంద్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. అందులో భాగంగా నంద్యాల జిల్లాపై వరాలజల్లు కురిపించారు. వ్యాపారులు, రైతులు, నిరుద్యోగులకు బాసటగా నిలిచేలా జిల్లాలో రెండు కీలక ప్రాజెక్టులకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఆ రెండు ప్రాజెక్టులు కూడా రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రానిథ్యం వహిస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి నియోజకవర్గం బనగానపల్లెకు దక్కాయి. క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ(బార్మర్) ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ అవుకు మండలంలోని అవుకు, సింగనపల్లి, కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామాల్లో రెండు సోలార్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ రెండు ప్రాజెక్టులు సుమారు రూ.1,500 కోట్లు పెట్టుబడులతో సోలార్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో వెయ్యి మందికి ఉపాధి కల్పించనున్నారు.

ఇప్పటికే భూ సేకరణ...

అవుకు మండల పరిధిలోని అవుకు, సింగనపల్లి గ్రామాలకు చెందిన రైతులతో సుమారు 1,250 ఎకరాల భూమిని సేకరించినట్లు సమాచారం. సదరు సంస్థ నిర్వాహకులు సైతం నిబంధనలు ప్రకారం ఆయా రైతులతో అగ్రిమెంట్‌లు తదితర ప్రక్రియను ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మొదలు పెట్టినట్లు ఆ వర్గాల నుంచి తెలిసింది. ఇప్పటికే 50శాతం ప్రక్రియ పూర్తయింది. అదేవిధంగా కొలిమిగుండ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో సదరు సంస్థ 38 ఎకరాలను గుర్తించింది. త్వరలో మిగతా ప్రక్రియను పూర్తి చేయనున్నారు. తాజాగా మంత్రివర్గం తీసుకున్న ఈ కీలక నిర్ణయాలపై నంద్యాల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కవి జంద్యాల రఘుబాబు పుస్తకాలపై సమాలోచన

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంద్యాల రఘుబాబు పదవీ విరమణ సందర్భంగా ఆయన రాసిన పుస్తకాలపై సమాలోచన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు స్రవంతి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నగరంలోని హోసన్న మందిరం సమీపంలో ఉన్న యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో స్రవంతి జిల్లా నాయకుడు మధు బాలగౌని కార్యక్రమానికి ఆహ్వానం పలుకుతారని తెలిపారు. జంద్యాల రాసిన అక్షరకాంతులు విమర్శ గ్రంథ పరిచయం కవి జి. వెంకటకృష్ణ, పెట్టుడు రెక్కలు పుస్తకాన్ని ఆర్‌యూ తెలుగు శాఖ సహాయ ఆచార్యులు జి. అరుణ, నెర్రెలు కవితా సంపుటిని విరసం నాయకుడు డాక్టర్ నాగేశ్వరాచారి పరిచయం చేస్తారని చెప్పారు. అద్దంలో బొమ్మలు కథా సంపుటిని స్రవంతి జిల్లా నాయకురాలు ఎన్ నాగమణి, సైరా మా బళ్లారి పాటల పుస్తకాన్ని స్రవంతి జిల్లా కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ పరిచయం చేస్తారని తెలిపారు.

హోరెత్తిన నిమజ్జనం


భక్తులతో కిక్కిరిసిన నగర వీధులు

కర్నూలు కల్చరల్/ న్యూసిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో గణేశ్ ఉత్సవాల సందర్భంగా నాలుగు ప్రాంతాల నుంచి ర్యాలీలు మొదలయ్యాయి. పాతనగరంలోని శ్రీరాంబొట్ల దేవాలయం వద్ద గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించగా, ఈ ఊరేగింపు వన్‌టౌన్, పూలబజార్, గడియారం ఆసుపత్రి, పెద్దమార్కెట్, కొండారెడ్డి బురుజు, రాజ్‌విహార్ మీదుగా కేసీ కెనాల్ వినాయక ఘాట్ వరకు కొనసాగింది. రెండో ఊరేగింపు నంద్యాల చెక్‌పోస్టు నుంచి గాయత్రి ఎస్టేట్ మీదుగా చేరుకుంది. ఇటు బళ్లారి చౌరస్తా నుంచి కొత్తబస్టాండు, మౌర్యఇన్, రాజ్‌విహార్ మీదుగా మూడో ఊరేగింపు కొనసాగింది. నాలుగో ఊరేగింపు కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి కృష్ణానగర్, గుత్తి పెట్రోల్ బంకు, గాయత్రి ఎస్టేట్ మీదుగా ఘాట్‌కు చేరింది. నగరంలోని ప్రధాన రహదారుల్లోని దుకాణాల నిర్వాహకులు స్వచ్ఛందంగా తమ దుకాణాలు మూసి వేశారు. అలాగే గురువారం పలు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి : కలెక్టర్ రంజిత్ బాషా

సిరి సంపదలతో జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని గణనాథుడిని కలెక్టర్ పి. రంజిత్ బాష వేడుకున్నారు. ఉదయం రాంబొట్ల దేవాలయం వద్ద వివేకానంద యువజన సంఘం ఏర్పాటు చేసిన మంటపం వద్ద ఆయన పూజలు నిర్వహించి నిమజ్జన ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎంపి డా. బైరెడ్డి శబరి, పాణ్యం, కోడుమూరు, పత్తికొండ, ఆదోని ఎమ్మెల్యేలు గౌరుచరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, డాక్టర్ బి. పార్థసారధి, జేసీ బి.నవ్య, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, నగర మేయర్ బీవై.రామయ్య, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.


వినాయకా.. వీడ్కోలిక

కిక్కిరిసిన కేసీ కెనాల్ ఘాట్

నగర నడిబొడ్డునగల కేసీ కెనాల్ ఒడ్డున ఉన్న వినాయక ఘాట్‌లో అంగరంగవైభవంగా గణేశ్ మూర్తుల నిమజ్జనోత్సవం ప్రారంభమైంది. ఈఏడాది నిర్ణీత సమయం కన్నా గంట ఆలస్యంగా కార్యక్రమాలను ప్రారంభించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన గణపతి మూర్తులను భారీ వాహనాల్లో, ఊరేగింపుగా తీసుకువచ్చిన గణేశ్ విగ్రహ మూర్తులను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ఎమ్మెల్యేలు గౌరు చరిత, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారధి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, నగర మేయర్ బీవై రామయ్య, ఆర్డీవో సందీప్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, విజయమనోహరి దంపతులు, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ఏపీ స్టేట్ గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ఉమ్మడి జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎం.నాగఫణిశాస్త్రి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేణుగోపాల్, గోరంట్ల రమణ, కే క్రిష్ణన్న, మోక్షేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ జ్యోతి ప్రజ్వలన, ధ్వజారోహణ చేసి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. తొలుత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పరిపాలన గణపతి విగ్రహానికి, నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన గణపతికి పూజలు చేసి శాస్త్రోకంగా గణేశ్ విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేసీ కెనాల్ వద్ద జరిగిన కార్యక్రమంలో గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నాగఫణిశాస్త్రి, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కొట్టే చెన్నయ్య, పరశురాముని రామకృష్ణలు వ్యాఖ్యానం చేస్తూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ భక్తుల్లో ఆసక్తిని రేకెత్తించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి నాయకులు రంగస్వామి, గూడా సుబ్రహ్మణ్యం, సందడి మహేష్, సందడి సుధాకర్, అక్కెం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. కేసీ కెనాల్ ఘాట్ వద్ద సంస్కార భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులకు అతిథులు జ్ఞాపికలు అందజేశారు.

లడ్డూను రూ.6 లక్షలకు కొనుగోలు చేసిన ఎంపీ శబరి

పాతనగరంలోని రాంబొట్ల దేవాలయం వద్ద నిమజ్జనోత్సవ ర్యాలీ ప్రారంభం సందర్భంగా నిర్వాహకులు పాడిన వేలం పాటలో అత్యధిక ధర రూ.6,01,000లకు లడ్డూ వేలం పాటపాడి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి స్వామివారి లడ్డూ దక్కించుకున్నారు.







ఆఖరికి అవస్థలే..!

- శ్మశాన స్థలం కబ్జాతో అంత్యక్రియలకు ఇబ్బందుల

చాగలమర్రి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొందరి భూదాహం శ్మశానాన్ని కబ్జా చేసేవరకూ వెళ్లింది. దీంతో ఆఖరి మజిలీకి కూడా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. శ్మశానాలను సైతం ఆక్రమించుకోవడం వల్ల అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించింది. చాగలమర్రి మం డలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో దళితులకు కేటాయించిన స్మశాన స్థలం ఆక్రమణకు గురైంది. దళిత కాలనీలో ఎవరైన మృతి చెందితే అంత్యక్రియలు, మృతదేహాన్ని పూడ్చేందుకు అవస్థలు తప్పడం లేదు. ఈ క్రమంలో గురువారం కరకాల యాకోబ్ (68) అనారోగ్యానికి గురై మృతి చెందాడు. శవాన్ని పూడ్చేందుకు స్థలం లేక అవస్థలు పడ్డారు. శవపేటికతో గ్రామ సమీపంలోని వంక వద్దకు తీసుకెళ్లి నీటిలో నుంచే మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. స్మశాన స్థలం లేక వంక వెంబడి అంత్యక్రియలు చేయాల్సి వస్తోంది. గతంలో 98 సర్వే నంబర్‌లో 45సెంట్ల స్థలాన్ని స్మశానం కోసం అధికారులు గతంలో కేటాయించారు. ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమిం చుకోవడంతో సమస్య తలెత్తిందని దళితులు ఆరోపిస్తున్నారు. స్మశాన స్థలానికి వెళ్లాలంటే రహదారి మధ్యన 16 అడుగుల లోతు వంక ఉంది. వంక ప్రవహించే సమయంలో శవాన్ని పూడ్చేందుకు వెళ్లాలంటే నరకయాతన తప్పదు.


తోడేండ్లపల్లెలో మృతదేహంతో వంకను దాటుతున్న దళితులు

భావి వెలుగుకు మార్గదర్శి

- కనిపించే దైవం గురువులు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

గురువు అనే పదంలోనే చీకటి నుంచి వెలుగుకు దారి చూపే అర్థం దాగి ఉంది. పాఠం చెప్పేటప్పుడు ఉపాధ్యాయుడు ఎంతో శాంతంగా ఉంటూ శిష్యులను బిడ్డలతో సమానంగా భావించి వారికి మరింత జ్ఞానాన్ని పంచుతాడు. సృష్టిలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వర రూపం గురువుగా భావిస్తారు. ఈ క్రమంలో విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని భావించి వారి కోసం ఉపాధ్యాయులు ఎనలేని కృషి చేస్తున్నారు. అందుకే ఉత్తమ ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రతి ఏటా సెప్టెంబరు ఐదో తేదీన ఉపాధ్యాయ దినోత్సవం రోజున వారికి సత్కారాలు చేస్తోంది.

విద్యాబోధనలో వినూత్నం

- టీచింగ్ టెర్నింగ్ మెటీరియల్ ద్వారా విద్యాబోధన



దృశ్యాలను చూపుతూ బోధిస్తున్న ఉపాధ్యాయురాలు వినూత

పత్తికొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠ్యాంశాలు సులభరీతిలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేందుకు వినూత్న పద్ధతిని ఎంచుకున్నారు ఉపాధ్యాయురాలు వినూత. పుస్తకాల్లో అక్షరరూపంలో ఉన్న పాఠాలను దృశ్యరూపకంలో చూపుతూ పాఠాలు బోధిస్తూ సరికొత్త విధానంలో పాఠ్యాంశాలను బోధిస్తూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. పత్తికొండ మండలం హోసూరు ఎంపీపీ (డబ్ల్యూ) ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యురాలిగా పనిచేస్తున్న గజ్జల వినూత కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం 'హ్యాపీచిల్డ్రన్స్' పేరిట వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటుచేశారు. పాఠశాలకు ఎవరైనా విద్యార్థులు హాజరు కాకపోతే వెంటనే తల్లిదండ్రులకు ఫోన్ చేసి విద్యార్థులను పాఠశాలకు రప్పించేలా చేస్తున్నారు. పాఠశాలకు రాని విద్యార్థులకోసం ఆ రోజు జరిగిన పాఠ్యాంశాలను వీడియోలో రికార్డుచేసి వాట్సప్‌గ్రూప్‌లో పోస్ట్ చేస్తారు. దీంతో తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులు ఆ వాట్సప్‌లోని పాఠాలను వింటున్నారు. వినూత సేవలను గుర్తించిన విద్యాశాఖ 2023లో ఉత్తమ జిల్లా ఉపాధ్యాయురాలిగా సన్మానించింది. పాఠశాల విద్యార్థులకే కాకుండా దృశ్యరూపక పాఠ్యాంశాలు అందరికీ అందేలా వీడియోలను యూట్యూబ్‌లో ఉంచుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

పాఠ్యాంశాలే కాదు.. పోటీ పరీక్షలకూ శిక్షణ

- ఐదేళ్లలో 27 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపిక
- హెచ్‌ఎం చంద్రశేఖర్‌ను మెచ్చుకుంటున్న తల్లిదండ్రులు



విద్యార్థులకు పాఠం చెబుతున్న హెచ్‌ఎం చంద్రశేఖర్

తుగ్గలి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠ్యాంశాలే కాదు.. ఒకటో తరగతి నుంచే పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు మండలంలోని మిద్దె తండా ఎంపీయూపీ స్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్. అంకితభావంతో పనిచేస్తున్నా ఆ హెచ్‌ఎంను తల్లిదండ్రులు మెచ్చుకుంటున్నారు. 2021 నుంచి ఇదే పాఠశాలలో పనిచేస్తున్నారు. నాలుగో తరగతి అనంతరం ఐదో తరగతిలో గురుకుల పాఠశాలల్లో సీటు సాధించేలా శిక్షణ ఇచ్చారు. 2021లో ఇద్దరు విద్యార్థులు, 2022లో నలుగురు, 2023లో ముగ్గురు, 2024లో నలుగురు, 2025లో 14 మంది గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడం విశేషం. మిద్దె తండా, చిగుర్లగుట్ట తండాల్లో ప్రతి ఒక్కరూ వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలో విద్యను చెప్పించే స్థోమత లేక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలకే విద్యార్థులు వెళ్లి విద్యనభ్యసించే వారు. అనంతరం ఏదైనా హాస్టల్స్‌లో సీట్లు వస్తే చదివించేవారే తప్ప.. లేకపోతే చదువులు మాన్పించి పనులకు తీసుకెళ్లేవారు. అయితే చంద్రశేఖర్ ఈ పాఠశాలకు వచ్చిన తర్వాత విద్యార్థులకు శిక్షణ ఇచ్చి గురుకులాలకు ఎంపికయ్యేలా కృషి చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించడానికి ఆసక్తి చూపుతున్నారు. మారుమూల ప్రాంతమైన గిరిజన ప్రాంతంలో విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు అందించడం ఎంతో సంతోషమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది జూన్‌లో హెచ్‌ఎంను గ్రామస్థులు ఘనంగా ఊరేగింపు కూడా నిర్వహించడం ఆయన కృషికి నిదర్శనం. హెచ్‌ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు సాధారణ పాఠ్యాంశాల బోధనతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే శిక్షణ అందిస్తూ విద్యార్థులను ఎప్పటికప్పుడు నూతనోత్సాహాన్ని నింపుతూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకారాలు అందిస్తుండటంతో ప్రతి ఒక్కరూ పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటేలా కృషి చేస్తున్నామన్నారు.

ఆ ఉపాధ్యాయుడు ఆదర్శం

- సగం జీతం పేద విద్యార్థుల కోసమే



మైకు ద్వారా పాఠాలు చెబుతున్న నిరంజన్ కుమార్

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగిస్తూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తున్నారు ఆదోని పట్టణంలోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నిరంజన్ కుమార్. విద్యార్థులకు తరగతి గదిలో తాను చెప్పే పాఠం అందరికి వినిపించేలా తన సొంత ఖర్చులతో మైక్ కొని పాఠ్యాంశాలు బోధిస్తూ ఎందరో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. ఉద్యోగాన్ని కర్తవ్యంగా భావించి బోధనలో మెలుకువలు నేర్పుతూ ఉత్తమ ఫలితాలు కోసం కృషి చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకంగా తన సబ్జెక్టులో సందేహాలు నివృత్తి చేసి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తున్నారు. చదువుతోపాటు మానవ సంబంధాలు, నైతిక విలువలు వంటి తెలుపుతూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నారు. అంతేకాదు తల్లిదండ్రులు లేని ఉన్నత చదువులు చదివేందుకు ఆర్థిక స్తోమత లేని వారిని దత్తత తీసుకొని ఎంతో మందికి చదువులు చెప్పిస్తున్నారు. అందరికీ ఆదర్శంగా నిలుసున్నారు. వృత్తిపట్ల అంకిత భావం ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని తాను చేస్తున్న వృత్తికి అంకితభావంతో పనిచేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఏ అవసరం ఉన్నా తన దగ్గరకు వస్తే అవసరాన్ని తీరుస్తున్నారు. నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్, ఎన్‌ఎంఎంఎస్, పరీక్ష పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోసం ఉచితంగా సాయంత్రం వేళలో పాఠశాలలోనే కోచింగ్ ఇస్తున్నారు. పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఓ విద్యార్థిని నాన్న చనిపోవడంతో ఉన్నత చదువులు చదువుకోలేని పరిస్థితి ఆ విద్యార్థిని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు రావడానికి కృషి చేసి చదువుకు అయ్యే ఖర్చులను మూడేళ్లుగా ఆయన భరిస్తున్నారు. అంతేకాదు ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న మరో విద్యార్థిని పాఠశాల టాపర్‌గా రావడంతో చదువులకు అయ్యే ఖర్చులను భరిస్తూ వారిద్దరిని దత్తత తీసుకుని చదివిసున్నారు.

డ్రగ్స్ నివారణకు కృషి

- ఉత్తమ అధ్యాపకురాలిగా ప్రొఫెసర్ అనూష



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నివారణలో విద్యార్థుల్లో చైతన్యం తెచ్చి యువతలో మార్పు తీసుకొచ్చిన సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల అధ్యాకురాలు ప్రొఫెసర్ బి. అనూషకు ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు వరించింది. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రటరీ కోనశశిధర్ పలువురు అధ్యాపకులను ఎంపికి చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ మేరకు కర్నూలు జిల్లా నుంచి ప్రొఫెసర్ అనూష ఎంపికయ్యారు. ఈమె జాతీయ స్థాయిలో 24, అంతర్జాతీయ స్థాయిల్లో 11 పరిశోధనలు చేయడంతో పాటు 95 వ్యాసాలు రాసి గుర్తింపు పొందారు. 2024లో బయోటెక్నాలజీని(ఆర్గానిక్ వేస్టు రిప్రెసింగ్ టెక్నికల్ ఫర్ సింథటిక్ కెమిస్ట్రీ) ద్వారా ప్రత్యేక పరిశోధనలు చేశారు. వీటితో పాటు యూజీసీలో ఆర్గానిక్స్ పై ఎన్నో పరిశోధనలు చేశారు. పీజీ, యూజీ కళాశాల పరిధిలో కెమిస్ట్రి విభాగంలోని సెంట్రల్ యూనివర్సిటీ, పద్మావతి మహిళా యూనివర్సిటీతో పలు ఉమ్మడి రాష్ట్రం, జిల్లాలోని పలు కళాశాలల్లో దాదాపు 14 సంవత్సరాలుగా సేవలు అందించారు. ప్రస్తుతం సిల్వర్‌జూబ్లీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రామ్ చీఫ్‌గా బాధ్యతల్లో ఉంటూనే అనేక పరిశోధనలు, వ్యాసాలు చేస్తున్నారు. ఇటీవల ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిరోధానికి సంబంధించిన పలు కార్యక్రమాలు చేపట్టారు అనూష ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ అమరావతిలో శుక్రవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకోవడం ఊహించనిదని తెలిపారు.

కౌతాళం అధ్యాపకుడికి రాష్ట్రస్థాయి అవార్డు



కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కౌతాళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజి అధ్యాపకుడిగా పనిచేస్తున్న మలిగే.సంతోష్ కుమార్ ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో సంతోష్ కుమార్ ఉత్తమ అధ్యాపక అవార్డును ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి అందుకోనున్నారు. నందవరం గ్రామానికి చెందిన ఈయన ఆదోనిలో స్థిరపడ్డారు. ఈయన విద్యాభ్యాసం గుంతకల్లులోనే కొనసాగింది. 1994లో కర్నూలు శంకరాస్ కళాశాలో బీఈడీ పూర్తి చేశారు. 1997డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్(జువాలజి) ఎంపికై గుంతకల్లు మండలం కసేకల్ పాఠశాలలో ఉద్యోగంలో చేరారు. 2001 సంవత్సరంలో స్కూల్ అసిస్టెంట్ నుంచి జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఎం.సంతోష్ కుమార్ మాట్లాడుతూ తనకు అవార్డు రెట్టింపు ఉత్సాహన్ని ఇస్తోందన్నారు. బాధ్యతను పెంచిందన్నారు. ఇదే స్ఫూర్తిని తీసుకొని విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన బోధన చేసేందుకు కృషి చేస్తానన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



హనుమంతు (ఫైల్)

మద్దికెర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న తాసిల్ హనుమంతు (50) అనే రైతు అప్పుల బాధతో గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలివీ.. హనుమంతు నాలుగు ఎకరాల పొలంలో సాగు చేసుకుంటూ, అలాగే వ్యవసాయ పాటు కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయంలో నష్టం రావడంతో నాలుగేళ్ల క్రితం రెండెకరాల పొలాన్ని విక్రయించారు. మరో రెండెకరాలలో కంది పంటను సాగుచేసేవారు. సాగుకోసం దాదాపు రూ.8 లక్షలు అప్పు చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఉరివేసుకున్నారు. హనుమంతుకు భార్య, తల్లి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య హేమలత ఫిర్యాదు మేరకు ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్ కేసు నమోదు చేసుకొని పోస్టుమా ర్టం నిమిత్తం మృతదే హాన్ని గుంతకల్లుకు తరలించారు. కుటుం బాన్ని ఆదుకోవాలని పంచాయతీ సభ్యులు లక్ష్మీనారాయణ, బాలచంద్ర కోరారు.

హత్య కేసు నమోదు

ఆస్పరి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోగల్‌గల్ గ్రామంలో అహోబిలం అనే వ్యక్తిని హతమార్చడంపై హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. విచారణ చేసి నిందితులను అదుపులోకి తీసుకుంటా మన్నారు. అనంతరం హత్యకు గల కారణాలను వెల్లడిస్తామని తెలిపారు. హతుడు గొల్ల అహోబిలం తండ్రి రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద మృతిగా..

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరుకు చెందిన వీరేంద్ర మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంట్లో అవ్వ, తమ్ముడు నిద్రపోతున్న సమయంలో మంగళవారం అర్ధరాత్రి వీరేంద్ర అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకొని కనిపించాడు. యువకుడి తల్లిదండ్రులు అరుణాచలం వెళ్లడంతో ఎవరూ ఫిర్యాదు చేయలేదు. గురువారం వారు వచ్చిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.

ఎం.గణపురంలో మహిళ దారుణ హత్య

- వదినను రాడ్‌తో కొట్టి చంపిన మరిది

పగిడ్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధాన్ని మానుకోవాలని చెప్పినా వినకపోవడంతో అన్న భార్య సుగాలి నాగమ్మ(60)ని మరిది లోకనాయక్ ఇనుప రాడ్‌తో తలపై కొట్టి చంపిన సంఘటన పగిడ్యాల మండలంలోని ఎం.గణపురం గ్రామంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు... ఎం.గణపురం గ్రామానికి చెందిన సుగాలి నాగమ్మ భర్త 20 ఏళ్ల క్రితం చనిపోయాడు. నలుగురు పిల్లలు హైదరబాద్‌లో మేస్త్రీ పని చేసుకుంటున్నారు. నాగమ్మ గ్రామంలో ఒంటరిగా ఉంటూ కొద్దిరోజుల నుంచి మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటోందని గ్రామస్థుల ఆరోపణ. అయితే ఈ విషయంపై మరిది లోక నాయక్ తరచూ నాగమ్మతో గొడవకు దిగేవాడు. ఇదే సమయంలో గురువారం ఉదయం ఇద్దరి మధ్య పెద్దస్థాయిలో గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన లోకనాయక్ ఇనుప రాడ్డుతో నాగమ్మ తలపై కొట్టి చంపేశాడు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ తిరుపాలు, ఏఎస్ఐ శేషయ్య సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుమార్తెతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

- తుంగభద్ర నదిలో దూకిన ఇద్దరిని రక్షించిన స్థానికులు, పోలీసులు
- మంత్రాలయంలో ఘటన




పోలీసు స్టేషన్‌లో రజిని, కీర్తనతో ఐసీడీఎస్ సూపజర్‌వైజర్

మంత్రాలయం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సమీపంలోని తుంగభద్ర నదిలో బెంగళూరుకు చెందిన రజిని (35), కూతురు కీర్తన(8) తుంగభద్ర నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేశారు. హెడ్ కానిస్టేబుళ్లు అంజి, మల్లికార్జున స్వామి, హోం గార్డు నాగేశ్వర రెడ్డి తల్లి, కూతురిని ఒడ్డుకు చేర్చి వారికి స్థానిక వైద్యులతో వైద్యం చేయించారు. వివరాలివీ.. బెంగళూరుకు చెందిన సుంకార్ తట్టె కాలనీకి చెందిన బీఎన్ రజిని, బీఎన్ శివకుమార్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు పదోతరగతి, రెండో కూతురు కీర్తన రెండో తరగతి చదువుతోంది. రజిని తన ఇంటి పక్కన ఉన్న దివ్య అనే మహిళకు వడ్డీ వ్యాపారుల దగ్గర పూచీకత్తు ఉండి రూ.లక్షల్లో అప్పు ఇప్పించింది. మూడు నెలలైనా దివ్య తప్పించుకొని తిరుగుతోంది. దీంతో అప్పు ఇచ్చిన వారు పూచీకత్తు ఉన్న రజిని అప్పు చెల్లించాలని ఒత్తిడి చేయటంతో ఈనెల 1న చిన్న కూతురును తీసుకొని మంత్రాలయానికి వచ్చింది. తన భార్య, కూతురు కనిపించడం లేదని రజిని భర్త శివకుమార్ బెంగళూరులోని బ్యాగరి హళ్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం మంత్రాయం దగ్గర ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలోకి దూకిన వారిని అక్కడ ఉన్న స్థానికులు, పోలీసులు ప్రాణాలకు తెగించి తల్లి, కూతురిని కాపాడారు. కూతురు కీర్తన తండ్రి సెల్‌ఫోన్ నెంబర్ ఇవ్వడంతో శివశంకర్‌కు సమాచారం ఇచ్చారు. శివశంకర్ బ్యాగర్ హళ్లి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో అక్కడ సీఐ మంత్రాలయం ఎస్ఐ శివాంజల్‌కు ఫోన్‌లో మాట్లాడించారు. ప్రస్తుతం తల్లి, కూతరు ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుమిత్రమ్మ, అంగన్ వాడీ టీచర్లు భీమేశ్వరి, కల్యాణి సమక్షంలో మంత్రాలయం పోలీసు స్టేషన్‌లో సురక్షితంగా ఉన్నారు. తల్లి కూతుళ్లను కాపాడిన గ్రామస్తులను, పోలీసులను గ్రామస్థులను అభినందించారు.

శ్రీశైలానికి పెరిగిన ఇన్‌ఫ్లో

- మూడు గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యామ్‌కు వరద ప్రవాహం పెరగడంతో 3గేట్లను తెరచి 82,710 క్యూసెక్కులు సాగర్‌కు సాగనంపుతున్నారు. ఎగువ పరివాక ప్రాంతాలైన జూరాల, విద్యుదుత్పత్తి, సుంకేసుల నుంచి మొత్తం 1,64,124 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం డ్యాం నీటిమట్టం గురువారం సాయంత్రం 6గంటల సమయానికి 883 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 209 టీఎంసీలుగా నమెదు అయింది. శ్రీశైలం రెండు విద్యుత్ క్రేంద్రాల్లో అనంతరం 66,327 క్యూసెక్కుల నీటి విడుదలు చేస్తున్నారు.



డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు

శ్రీశైలం డ్యాం ఇన్‌చార్జి ఎస్ఈగా బాలచంద్రారెడ్డి బాధ్యతలు



శ్రీశైలం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం ఇన్‌చార్జి ఎస్.ఈగా బి.బాలచంద్ర రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాలచంద్రారెడ్డి ప్రస్తుతం కర్నూలు జలవనరుశాఖ ఎస్ఈ ఐజీ సర్కిల్‌లో పనిచేస్తున్నారు. శ్రీశైలం డ్యాంను సందర్శించి వరద నీటి చేరికలు, క్రస్ట్‌గేట్ల పనితీరు తదితర అంశాలపై ఈఈ వేణుగోపాల్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. జలాశయం ఇంజనీర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

దిగివచ్చిన వ్యాపారులు

- గ్రేడింగ్ లేకుండా వేరుశనగ కొనుగోలుకు సుముఖత
- సబ్ కలెక్టర్‌తో చర్చలు సఫలం



సబ్ కలెక్టర్‌తో చర్చిస్తున్న వేరుశనగ వ్యాపారులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో వేరుశనగ గ్రేడింగ్ విధానం రద్దుకు వ్యాపారులు సుముఖత వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం మరోమారు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన వేరుశనగ వ్యాపారులతో చర్చలు జరిపారు. రైతులకు నష్టం కలిగించే గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని వ్యాపారులను ఆయన హెచ్చరించారు. ఉదయం చర్చల్లో న్యాయవాదులతో కలిసి హాజరైన వ్యాపారులు గ్రేడింగ్ కొనసాగించాలని, లేకపోతే ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్‌లో తూకాలు ఏ విధంగా చాట ద్వారా కొనసాగుతాయో ఆ విధంగా ఇక్కడ హమాలీలు తూకాలు వేస్తే అభ్యంతరం లేదంటూ చెప్పుకొచ్చారు. సబ్ కలెక్టర్ వారం రోజులపాటు యథావిధిగా రైతులు తెచ్చిన వేరుశనగ దిగుబడులను గ్రేడింగ్ లేకుండా కొనసాగించాలని, ఏదైనా నష్టం కలిగించే విధంగా ఉంటే తరువాత చూద్దమంటూ వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు కలెక్టర్ మాటకు సమ్మతిస్తూ కొనుగోలు చేస్తామని ముందుకు వచ్చారు. రైతులు ఇంటి వద్దనే బాగా గ్రేడింగ్ చేసుకొని ఆరబెట్టుకొని వేరుశనగను తీసుకురావాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మార్కెట్ యార్డ్‌లో తేమశాతం అధికంగా ఉంటే రాశులుగా కాకుండా వేరుశనగ పరిచి టెండర్‌కి ఉంచవచ్చన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన, వేరుశనగ వ్యాపార సంఘం నాయకుడు శరణప్ప నాగరాజు, మస్తాన్ పాల్గొన్నారు.

త్రిమూర్తుల స్వరూపమే గురువు

- బలపం ముక్కపై సూక్ష్మ చిత్రాలు



బలపం ముక్కపై సూక్ష్మ చిత్రాలు



చిత్రకారుడు కోటేష్

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేశ్ జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని చిన్న బలపం ముక్కపై వాటర్ కలర్ పెయింటిగ్స్‌తో మైక్రో బ్రష్‌తో గురువు గొప్పతనం తన చిత్రం ద్వారా తెలిపారు. త్రిమూర్తుల స్వరూపమే గురువని త్రిమూర్తులయున బ్రహ్మ, విష్ణు, ఈశ్వరుడు, సర్వేపల్లి రాధాకృష్ణన్, అలాగే గురువుకు ఒక విద్యార్థి వందనం చేస్తున్నట్లు చిత్రం గీశారు. గురువు అంటే ఒక మార్గదర్శి, అందుకే గురుబ్రహ్మ, గురువిష్ణు, గురుదేవో మహేశ్వరా, గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురువే నమ:అని గురువులను త్రిమూర్తులతో పోలుస్తారు. గురువు గొప్పతనం గురించి ఎంతో సందేశమిచ్చే చిత్రాన్ని సూక్ష్మ చిత్రాలతో వేశానని కోటేశ్ తెలిపారు.



గురు పూజోత్సవ శుభాకాంక్షలు

అపూర్వ అక్షర్‌ధామ్ సమీపంలో

అయోధ్య నగర్

@ నందికొట్కూరు రోడ్, కర్నూలు.

రూ. 49.99 లక్షలు

రెండు ఇండ్లు మాత్రమే కలవు.

(1) కేవలం రూ. 2 లక్షలు మాత్రమే చెల్లించండి ఇల్లు సొంతం చేసుకోండి. (2) బ్యాంకు లోన్ సౌకర్యం కలదు.

99669 86866/ 99632 54517

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.

AJA- 246588

CHANGE OF NAME

I, Shahida Bi W/o.Bakkar Bade Saheb (Old Name) R/o.H.No:18-482, Court Road, Yemmiganur, Kurnool Dist-518360, AP., I Have Changed My Name Known as Bakkar Shahida Bee W/o. Bakkar Bade Saheb (New Name)

AJL-236748

CHANGE OF NAME

I, GADWAL ZUBEDA BEGUM (Old Name) W/o.GADWAL SYED BASHA R/o.HNo:26-74-C, Kowdelpet Street, Near Dewan Sab Dargah, Adoni-518301, Kurnool dist, AP., have Changed my name to GADWAL ZUBEDA BEE (New Name) here after my name is know as GADWAL ZUBEDA BEE

AJL-236891

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించదమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, ఇట్టి వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

ఘనంగా యాగంటీశ్వరస్వామి ఆరాధనోత్సవం



ఆలయంలో హారతి తీసుకుంటున్న నూతన చైర్మన్ శ్రీనివాసులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో అంబాసహిత యాగంటీశ్వరస్వామి ఆరాధనోత్సవం స్వామివారి వంశీకుల ఆధ్వర్యంలో గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, గంగా పూజ, గణపతి పూజ, రుద్రాభిషేకం తదితర హోమాలు నిర్వహించారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కె.పార్వతమ్మ, ఆలయ నూతన చైర్మన్ శ్రీనివాసులు స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గుంతకల్లు ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను బర్తరఫ్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాఘవేంద్ర, అబ్దుల్లా, పీఎస్ఎం జిల్లా నాయకులు ఎస్ కన్నా మాట్లాడారు. ప్రజలకు అండగా నిలవాల్సిన ఎమ్మెల్యే జయరాం కమీషన్లకు కక్కుతిపడి రైతుల భూములను యథేచ్ఛగా సోలార్ కంపెనీకి అప్పజెప్పడానికి పూనుకున్నారని విమర్శించారు. వ్యతిరేకించిన రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్‌రెడ్డిని ఫోన్‌లో దురుసుగా మాట్లాడటం సరికాదన్నారు.

వర్సిటీల్లో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూని వర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో ఈనెల 6న చలో విజయవాడ పోస్టర్లను విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది దాటినా వర్సిటీల్లో సమస్యలను పరిష్క రించడంలో విఫలయ్యాయరని ధ్వజమెత్తారు. జీవో నంబరు 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, సం దీప్, అశోక్, గణేశ్, పవన్, తిరుమల్ పాల్గొన్నారు.

సుంకాల పెంపుపై రేపు నిరసన: సీపీఐ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అమెరికా సుంకాల పెంపునకు నిరసనగా ఈనెల 6న నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితి తగ్గిం చడం, జరిమానాలు విధించడం వంటి కారాణాలతో ఎన్నో ఆశలతో ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థుల కలలు పేకమేడ కూలిపోతున్నాయన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకి వీడ్కోలు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఆర్‌డ బ్ల్యూఎస్ సూపరిండెంటింగ్ ఇంజనీర్ నాగేశ్వరావుకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఇక్కడ పని చేస్తున్న ఆయనను విశాఖపట్టణానికి బదిలీ చేశారు. ఈ మేరకు నంద్యాల ఈఈగా పని చేస్తున్న మనోహర్‌ను కర్నూలు ఎస్ఈగా నియమించారు. గురువారం జిల్లా పరిషత్ ఆవరణలోని ఎంపీపీ హాలులో నిర్వహించిన వీడ్కోలు సభలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నాగేశ్వరావుకు వీడ్కోలు పలకడంతోపాటు మనోహర్‌కు స్వాగతం పలికారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

కర్నూలు, ఎడ్యుకేషన్ సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 6న నిర్వహించే చలో విజయవా డను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్, కార్యదర్శి రంగప్ప పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయి బర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, జీవో నంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

కర్నూలు హస్పిటల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5 నుంచి 15 వరకు ఉచిత బ్రెస్ట్ స్క్రీనింగ్, మమోగ్రామ్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఉమ్మడి జిల్లాలోని మహిళా ఉపాధ్యాయులు, ఆధ్యాపకులకు నిర్వహిస్తున్నట్లు ఓమెగా ఆస్పత్రి సీఈవో డాక్టర్ గణేశ్ గురువారం తెలిపారు. 40 ఏళ్ల దాటిన మహిళా ఉపాధ్యాయులు, ఆధ్యాపకులు ఉచిత రొమ్ము స్క్రీనింగ్ పరీక్షలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు.

సోమయాజులపల్లెలో వినాయక నిమజ్జనం




నిమజ్జనానికి గణనాథులను తరలిస్తున్న భక్తులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో గురువారం వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం కాల్వబుగ్గ దేవస్థానం వెనుక ఉన్న మినీ రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. రచ్చకట్ట వద్ద కొలువైన వినాయక మండపాల వద్ద నిర్వహించిన వేలం పాటలో పది కేజీల లడ్డూను తెలుగు గంగాధర్ రూ.16 వేలు, తొమ్మిది కేజీల లడ్డును హనుమంతు రూ.7 వేలు, కలశం టెంకాయలను బోయ నాగరాజు 17,500 పాట పాడి దక్కించుకున్నారు.

గంగ ఒడికి గణపయ్య



- ఉత్సాహంగా గణేశ్ శోభాయాత్ర
- యువత నృత్యాల జోరు.. డీజేల హోరు
- కిక్కిరిసిన నగర రహదారులు





వినాయక ఘాట్ వద్ద అర్ధరాత్రి సమయంలో గణేశ్ విగ్రహ నిమజ్జనం



నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు



నిమజ్జనానికి వెళ్తున్న వినాయకుడు



వినాయకుడి లడ్డూతో..



శోభాయాత్రలో యువత

కర్నూలు కల్చరల్/న్యూసిటీ/అర్బన్/ కల్లూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం అంటేనే సందడి. ఐక్యతకు నిర్వచనం. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా బొజ్జ గణపయ్యను సాదరంగా సాగనంపడానికి ఉత్సాహం చూపుతారు. వినాయక చవితి సందర్భంగా కర్నూలు నగరంలో 9 రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు గురువారం నిమజ్జనానికి తరలివెళ్లాడు. వాహనాల మీద ఆశీనుడైన గణనాథుడి ఊరేగింపు ఎదుట పిల్లలు, పెద్దలు ఆనందంతో చిందులు వేశారు. డీజే సౌండ్స్ దద్దరిల్లాయి. అనంతరం భక్తి శ్రద్ధలతో విగ్రహాలను కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు.

గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా వినాయక ఘాట్‌ను శుభ్రంగా తీర్చిదిద్దిరు. కెనాల్‌కు అటూ, ఇటూ రెండు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. కెనాల్ వెంట అడుగడుగునా పోలీసులను ఏర్పాటు చేశారు. రంగురంగుల విద్యుద్దీప కాంతుల్లో ఘాట్‌ను వెలిగిపోయింది.

- భక్తులకు అసౌకర్యం కలగకుండా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రాంబొట్ల దేవాలయం నుంచి వినాయక ఘాట్ వరకు తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరాలతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు అన్నదానం, అల్పాహారం పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశాయి.
- నగర పాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రతిష్ఠించిన 8 అడుగుల మట్టి విగ్రహన్ని నిమజ్జనం చేశారు. కమిషనర్ పి.విశ్వనాథ్ నృత్యాలు చేసి అందరిని ఉత్సాహపరిచారు. వీరితో పాటు అధికారులు, యువత కలిసి డాన్సులు వేస్తూ అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మెడికల్ హెల్త్ అధికారి కె.విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఇన్‌ఛార్జి ఎస్ఈ శేషసాయి తదితరులు పాల్గొన్నారు.
- నగరంలోని కేఈ ప్లాజా వద్ద ఈడిగ, గౌడ్ సంక్షేమం సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కేఈ విజయ్‌కుమార్ గౌడ్, కాసాని మహేష్ గౌడ్, సురేష్ పాల్గొన్నారు.
- జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట సిటీ ప్రెసిడెంట్ షేక్ జిలానీ బాషా, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అనంతరత్నం మాదిగ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖాజా హుసేన్ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు సరఫరా చేశారు.
- నగరంలోని 19, 20 వార్డుల్లోని వినాయక మండపాలను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి గురువారం సందర్శించారు. పలు కాలనీల్లో వినాయక విగ్రహాలకు ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఆమ వెంట ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.పార్వతమ్మ, నాయకులు ప్రభాకర్‌యాదవ్, పెరుగు పురుషోత్తంరెడ్డి, నాగిరెడ్డి ఉన్నారు.
- కల్లూరు అర్బన్ ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం సందర్భంగా శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. వినాయక మండపాల్లో ఉదయం నుంచి లడ్డూవేలం పాట, ఉట్టికొట్టే ఆట, మహిళలకు మ్యూజికల్ చైర్స్, కోలాటం, భజనలు, డోలువాయిద్యాలు, డీజేలతో యువత కేరింతలతో నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. శోభాయాత్ర నిర్వహించి ప్రజలు కెసీ కెనాల్ సమీపంలో వినాయకుడిని నిమజ్జనం చేశారు.
- కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద గురువారం రాత్రి నిర్వహించిన గంగా హారతి కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. గణేష్ మహోత్సవ కమిటీ కన్వీనర్ నాగఫణి శాస్త్రి ఆధ్వర్యంలో అర్చక బృందం తుంగభద్రమ్మ తల్లికి నవవిధ రూపాల్లో హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు గంగా హారతిని కనువిందుగా తిలకించారు.
- నగరంలోని జిల్లా పరిషత్, నగర పాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయుడిని ఘనంగా నిమజ్జనం చేశారు. నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్, మేయర్ బీవై.రామయ్య, జడ్పీ డిప్యూటి సీఈఓ వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.
- వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో నగరలోని పలుచోట్ల అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



అన్నదానం చేస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు



వినాయకుడి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత





నృత్యం చేస్తున్న బాలికలు, సెల్ఫీ తీసుకుంటూ..



టెలికాం నగర్‌లో కోలాటం ఆడుతున్న మహిళలు



ధ్వజావరోహణ చేస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



శోభాయాత్రలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్, మేయర్, సిబ్బంది



గాంధీ టవర్స్ బీ బ్లాక్‌లో మహిళల ఉత్సాహం



మునగలపాడు సమీపంలో కేసీ కెనాల్‌లో నిమజ్జన వేడుకలు



బళ్లారి రోడ్డులోని వాసవీనగర్ విగ్రహం ఎదుట కోలాటం





శోభాయాత్రలో మహిళలు



బిర్లా కాంపౌండ్‌లో దేవానగర్ యూత్ ఆధ్వర్యంలో...



రెండో వార్డు సుబేదార్ వీధిలో వినాయకుడి ఊరేగింపు



వినాయక ఘాట్‌లో కలెక్టరేట్ ఉద్యోగుల కళా ప్రదర్శన



అన్నదానం చేస్తున్న మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, కేవీ సుబ్బారెడ్డి

ఎక్సైజ్ అధికారుల దాడులు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనంలో అక్రమ మద్యంపై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విస్తృత దాడులు చేసింది. గురువారం నగరంలోని పలు ప్రాంతల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.హనుమం తరావు ఆదేశాల మేరకు ఆ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖరగౌడ్ ఆధ్వర్యంలో సీఐ జయరాముడు, సిబ్బంది తనిఖీలు చేశారు. బిర్లాగేట్ సమీపంలో టీవీఎస్ స్కూటర్‌పై మద్యం విక్రయిస్తున్న బోయ వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించామని అసిస్టెంట్ సూపరింటెండెంట్ తెలిపారు. ఎస్ఐ మారుతి ప్రసాద్, పాల్గొన్నారు.



మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

క్యాజువాలిటీలో సూపరింటెండెంట్ మకాం

వైద్య సేవలపై ఆరా

కర్నూలు హస్పిటల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో వినాయక నిమజ్జనం సందర్భంగా శోభాయాత్రలో గాయపడిన క్షతగాత్రులకు సత్వరమే వైద్యం అందించాలనే ఉద్దేశంతో కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు అత్యవసర విభాగంలోనే మకాం వేశారు. అక్కడ ఉంటూ వైద్య సేవలపై ఆరా తీశారు. శోభాయాత్ర సందర్భంగా ప్రధాన రోడ్లన్ని ట్రాఫిక్ అంతరాయం కలగడంతో ఆయన నివాసం నుంచి కాలినడకన ఆసుపత్రికి చేరుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు. క్యాజువాలిటీలో వైద్య సేవల అనంతరం ఇతర వార్డులకు క్షతగాత్రులు, రోగులను తరలిం చారు. రాత్రి పది గంటల వరకు క్యాజువాలిటీలోనే మకాం వేశారు.



వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న సూపరింటెండెంట్

7న హరిహర క్షేత్రంలో సామూహిక వ్రతాలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో ఈనెల 7న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ ప్రకటనలో తెలిపారు. పూజల్లో పాల్గొనే భక్తులు ఆలయంలో తమ నామ గోత్రాలు తెలియజేసి, పూజలకు తగిన రుసుం చెల్లించి రసీదు పొందాలన్నారు. హరిహర క్షేత్రంలో ఆ రోజు భోజనాలు ఉండవని, స్వామివారి తీర్థ ప్రసాదాలు, పంచామృతం వితరణ చేస్తారని తెలిపారు. అదేరోజున సంపూర్ణ చంద్రగ్రహణం ఉన్నందున మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయం మూసివేస్తారని తెలిపారు. గ్రహణం అనంతరం ఆలయ సంప్రోక్షణ తర్వాత తిరిగి సోమవారం ఉదయం పూజలు ప్రారంభమవుతాయని సండేల్ చంద్రశేఖర్ తెలిపారు.

ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్‌గా బిల్లేకల్ వెంకటేష్

- దళితుడికి అవకాశం ఇచ్చిన టీడీపీ అధినాయకత్వం



ఆలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆస్పరి మండలం బిల్లేకల్ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బిల్లేకల్ వెంకటేష్‌ను పార్టీ అధినాకత్వం ఎంపిక చేసింది. ఈమేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. విద్యాకమిటీ చైర్మన్‌గా రాజకీయాల్లో ప్రవేశించిన వెంకటేష్ టీడీపీ నుంచి సర్పంచ్‌గా గెలుపొందారు. అనంతరం ఎంపీటీసీగా విజయం సాధించి, ఆస్పరి ఎంపీపీగా పనిచేశారు. ఆయన భార్య సంజమ్మ సర్పంచ్‌గా జనరల్ స్థానంలో పోటీ చేసి గెలిచారు. పార్టీ అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ఎంపిక చేసినట్లు సమాచారం. తనకు అవకాశమిచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, జిల్లా మంత్రి టీజీ భరత్, ఇన్‌చార్జి మంత్రి నిమ్మల, ఎంపీ నాగరాజు, ఎమ్మెల్సీ బి.టి.నాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఆదోని మార్కెట్ యార్డు కార్యదర్శిగా గోవిందు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యదర్శిగా కె.గోవిందును ఆ శాఖ కమిషనర్ విజయ సునీత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురంలో పనిచేస్తున్న ఈయనకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పజెప్పారు. ఇక్కడ పూర్తి అదనపు బాధ్యతలతో పని చేస్తున్న నంద్యాల మార్కెట్ కార్యదర్శి ఎం.కల్పనను యథాస్థానంలో నియమించారు. ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

తడి, పొడిచెత్తను వేరు చేయండి


మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో

మద్దికెర, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తడి, పొడిచెత్త ను వేరుచేసి పంచాయతీ కార్మికులకు ఇవ్వాలని డిప్యూటీ ఎంపీ డీవో విజయలక్ష్మీ కోరారు. గురువారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో చెత్త సేకరణను పరిశీలించారు. నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగి రోగాల బారిన పడతారన్నారు. కార్యదర్శులు శివకుమార్, విజయకుమార్ ఉన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవం

వెల్దుర్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక శారదా విద్యానికేతన్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ కాత్యాయని ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.


నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్. నం.: 72
1671 P# XIII / 132, 133 & 175, షరాఫ్ బజార్, ఆదోని - 518301, కర్నూలు జిల్లా, ఆం.ప్ర.
కస్టమర్ కేర్ సెల్ నం: 81259 10943, ఇ-మెయిల్ ఐడి: ho@avvabank.com

స్వాధీనతా ప్రకటన
(లాంఛనప్రాయం)
రూల్ 4, 8(1) & 8(2) క్రింద - (చర మరియు స్థిరాస్తుల కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, **శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఆదోని, కర్నూలు జిల్లా, ఆం.ప్ర.** అధీకృత అధికారియగు దిగువ సంతకందారు దిగువ తెలిపిన రుణగ్రహీతలకు **11.06.2025** తేదీగల డిమాండ్ ప్రకటన జారీచేశారు.
రుణగ్రహీత పేరు: గొల్ల సోమశేఖలు తండ్రి జి. మల్లికార్జున,
ఇ.నం.17-150-ఎ, ఆలూరు రోడ్డు, ఆదోని - 518301
MTL ఖాతా నం: 200230141003163

వారిని సదరు ప్రకటనలో తెలిపిన విధంగా **11.06.2025** నాటికి మొత్తం **రూ.37,60,946/- (ముప్పై ఏడు లక్షల అరవై వేల తొమ్మిది వందల నలభై ఆరు రూపాయలు మాత్రమే)** + **11.06.2025** నుండి వర్తింపుతో కాంట్రాక్చువల్ రేటు వంతున భవిష్య వడ్డీ + అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ.వి కూడా చెల్లించేందుకు బాధ్యులైన మిమ్మల్ని సదరు ప్రకటన స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించాలని కోరారు.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో రుణగ్రహీత విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ ఇందులో వివరించబడిన, బ్యాంకుకు తనఖాపెట్టబడిన ఆస్తులను దిగువ సంతకందారు **30.08.2025** తేదీన స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు/ హామీదారులకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడినది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు లభించే సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని ఉపసెక్షన్ (8)లోని ప్రొవిజన్లను గమనించవలసిందిగా రుణగ్రహీతను కోరడమైనది, అవి దిగువ విధంగా ఉన్నాయి:-

"సెక్యూర్డ్ ఆస్తుల లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపంలో బదిలీ కొరకు బహిరంగంగా లేదా ప్రైవేట్ ట్రీటీ ద్వారా కొటేషన్లు లేదా టెండరు కోరుట లేదా బహిరంగ వేలం కొరకు ప్రకటన ప్రచురణ తేదీలోగా ఏ సమయంలోనైనా సెక్యూర్డ్ క్రెడిటార్‌చే అయిన అన్ని వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో పాటు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తాలను సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించినచో"
(i) సెక్యూర్డ్ ఆస్తులను లీజు అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపంలో సెక్యూర్డ్ క్రెడిటార్‌చే బదిలీ చేయబడవు.
(ii) ఈ సబ్ సెక్షన్ క్రింద సదరు మొత్తం చెల్లించుటకు ముందు సదరు ఆస్తుల లీజు లేదా అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపంలో బదిలీ కోసం సెక్యూర్డ్ క్రెడిటార్‌చే ఏదైనా చర్య తీసుకున్నట్లయితే, సెక్యూర్డ్ ఆస్తుల లీజు లేదా అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపంలో సదరు సెక్యూర్డ్ క్రెడిటార్‌చే ఎలాంటి తదుపరి చర్య తీసుకోబడదు.

సదరు ఆస్తులతో ఎలాంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీతను/ హామీదారులను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారమైనా **29.08.2025** నాటికి మొత్తం **రూ.38,71,213/- (ముప్పై ఎనిమిది లక్షల డెబ్బై ఒక్క వేల రెండు వందల పదమూడు రూపాయలు మాత్రమే)** మరియు **30.08.2025** నుండి వర్తింపుతో కాంట్రాక్చువల్ రేటు వంతున భవిష్య వడ్డీ + అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ.వి **శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, ఆదోని, కర్నూలు జిల్లా, ఆం.ప్ర.** చార్జ్‌కు లోబడి ఉంటాయి.

షెడ్యూలు - సి
భాగం-1: (డాక్యుమెంట్లో పేర్కొన్న అన్ని తాకట్టుపెట్టబడిన ఆస్తులు అనగా స్టాక్స్, బుక్ డెట్స్, రిసీవబుల్స్, కన్జ్యూమబుల్ స్టోర్ & స్పేర్స్ సహా ప్రస్తుత ఆస్తులు మరియు తాకట్టుపెట్టబడిన మూవబుల్ ప్లాంట్ & మెషినరీ మొ.వి.) (షెడ్యూలు-బి)
భాగం-2: (మార్టిగేజ్ డాక్యుమెంట్లు / డీడ్‌ల తనఖాకు నిర్దేశము గల డాక్యుమెంట్లలో పేర్కొన్న విధంగా బ్యాంక్‌కు తనఖాపెట్టబడిన స్థిరాస్తుల వివరాలు) (షెడ్యూలు-బి)

ఆస్తి షెడ్యూలు
ఐటం నం.1: సేల్ డీడ్ నం.15035/2023 తేది 22.12.2023 ప్రకారం **గొల్ల సోమశేఖు,** నివాసం: ఆదోని వారి పేరున గల కర్నూలు రిజిస్ట్రేషన్ జిల్లా మరియు ఆదోని సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలోని ఆదోని మునిసిపాలిటీ లిమిట్స్‌లోని శిల్ప సౌభాగ్యనగర్‌లో ఉన్న సర్వే నం.353/1, DTCP T.L.P.No.60/2009Aలోని నం.167 కలిగిన ఖాళీ ప్లాట్ యావత్తు మరియు **సరిహద్దులు: తూర్పు:** ప్లాట్ నం.166, **పశ్చిమం:** ప్లాట్ నం.166, **ఉత్తరం:** వ్యవసాయ భూమి, **దక్షిణం:** 40 అడుగుల వెడల్పు రోడ్డు.
*డాక్యుమెంట్ ప్రకారం
ఐటం నం.2: సేల్ డీడ్ నం.3364/2023 తేది 20.03.2023 ప్రకారం **గొల్ల సోమశేఖు,** నివాసం: ఆదోని వారి పేరున గల కర్నూలు రిజిస్ట్రేషన్ జిల్లా మరియు ఆదోని సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలోని ఆదోని మునిసిపాలిటీ లిమిట్స్‌లోని శిల్ప సౌభాగ్యనగర్‌లో ఉన్న సర్వే నం.353/1, DTCP T.L.P.No.60/2009Aలోని నం.166 కలిగిన ఖాళీ ప్లాట్ యావత్తు మరియు **సరిహద్దులు: తూర్పు:** ప్లాట్ నం.166, **పశ్చిమం:** ప్లాట్ నం.166, **ఉత్తరం:** వ్యవసాయ భూమి, **దక్షిణం:** 40 అడుగుల వెడల్పు రోడ్డు.
*డాక్యుమెంట్ ప్రకారం

తేది: 30.08.2025 — సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: ఆదోని. — శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్

ఉపాధ్యాయ పురస్కారాలు

- ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆదోని నుంచి ముగ్గురు, పత్తికొండ, దేవనకొండ నుంచి ఇద్దరు, తుగ్గలి నుంచి ఒకరు ఎంపిక


హలీం సిద్దికి, నిరంజన్ కుమార్, సునీల్ రాజ్ కుమార్, కళ్యాణి, మారుతి, సౌభాగ్యరాణి, శ్రీనివాసులు, చంద్రమోహన్

ఆదోని అగ్రికల్చర్/ పత్తికొండ/ దేవనకొండ/ తుగ్గలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. వీరిలో ఆదోని పట్టణంలోని అందర్‌పేట ఉర్దూ పురపాలక ఉన్నత పాఠశాల హెచ్ఎం అలీం సిద్దిఖీ, మున్సిపల్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మిట్ట నిరంజన్ కుమార్, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు ఎస్‌జే సునీల్ రాజ్‌కుమార్, దొడ్డనకేరి జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు హసీనా, కపటి గ్రామ జడ్పీ పాఠశాల హెచ్ఎం పురుషోత్తమచారి, గణిత ఉపాధ్యాయుడు, కె.గోపాల్ ఉన్నారు. వీరు శుక్రవారం ఉపాధ్యా దినోత్సవం సందర్భంగా కర్నూలులో మంత్రులు, కలెక్టర్ చేతుల అవార్డు అందుకోనున్నారు.

పత్తికొండ నుంచి ఇద్దరు..
మండలంలోని జెఎం తండా, పులికొండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కళ్యాణమ్మ, మారుతి జిల్లాఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

దేవనకొండ ఉపాధ్యాయులు..
మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైయ్యారు. గుండ్ల కొండ జెడ్పీ పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు ఎస్.వి సౌభాగ్యరాణి, పి.కోటకొండ జెడ్పీపాఠశాలకు తెలుగు ఉపాధ్యాయుడు కె.శ్రీనివాసులు ఉత్తమ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు.

తుగ్గలికి చెందిన చంద్రమోహన్
మండలంలోని లక్ష్మీతండా ఎంపీపీ పాఠశాల హెచ్ఎం అద్దంకి చంద్రమోహన్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పిల్లలను బడిలో చేర్పించడం, విద్యాబోధన, వంద శాతం ఉత్తీర్ణత సాధించడంలో చేసిన కృషికిగాను ఎంపికచేశారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

మద్దికెర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి సూచించారు. గురువారం ఎం.అగ్రహారం గ్రామంలో మాట్లాడుతూ కండరాలు, కీళ్లనొప్పులు, తీవ్రమైన తలనొప్పి, శరీరమంతా దద్దుర్లు, వాంతులు, వికారం, అలసట ఉంటే డెంగీ లక్షణాలుగా పరిగణించాలన్నారు. బాధితులు దగ్గర్లోని ఆసుపత్రికి వెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ విజయుడు ఉన్నారు.

బైకులు ఢీ.. వ్యక్తులకు గాయాలు

వెల్దుర్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-44 సమీపంలో లద్దగిరి క్రాస్ వద్ద బైకులు ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు.. సిద్దనగట్టు గ్రామానికి చెందిన అయ్యస్వామి క్రిష్ణగిరి మండలం టీ.గోకులపాడు గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. లద్దగిరి క్రాస్ వద్ద ఎమ్మిగనూరు నుంచి హుసేనాపురానికి వెళ్తున్న రామాంజనేయులు బైకు ఢీ కొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. హైవే పోలీసులు క్షతగాత్రులను వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం కర్నూలు సర్వజనవైద్యశాలకు తరలించారు.

మెగా కాంప్లెక్స్ పనులు ప్రారంభం



పిల్లర్ల కడ్డీలను శుభ్రం చేస్తున్న కార్మికులు, సెల్లార్‌లో బురదను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

- వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వ ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేస్తున్న దుకాణదారులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్‌లో 14 నెలలుగా ఆగిపోయిన మున్సిపల్ మెగా కాంప్లెక్స్ పనులు ఎట్టకేలకు గురువారం ప్రారంభమయ్యాయి. ఈనెల 1వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ప్రజాధనం తుప్పు పడుతోంది' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ప్రభుత్వం, అధికా రులు పనులను వెంటనే ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతో గురువారం పనులను ప్రారంభించారు.

కాగా 2023లో అగ్రిమెంట్ కాగా, 2024 మార్చిలో కాంప్లెక్స్ నిర్మాణానికి నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ.33 కోట్ల వ్యాపారుల గుడ్‌విల్ డబ్బుతో 386 దుకాణాలు ఉండేలా మెగా కాంప్లెక్స్ ప్లాన్‌ను రూపొందించారు. అయితే పనులు హఠాత్తుగా నిలిచిపోవడంతో వేలంలో షాపులను దక్కించుకొన్న దుకాణదారులు తలలు పట్టుకొన్నారు. 25 శాతం కన్నా తక్కువగా చేసిన అన్ని పనులు ఆపివేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు ఆగిపోయాయి. కాగా పనులు ప్రారంభించడంతో వేలంలో దక్కించుకున్న దుకాణదారులు హర్షం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కడ్డీల సామర్థ్యం పరిశీలన
పనులు ఆగిపోయి చాలా కాలయం అవడంతో నాడు పిల్లర్లకు వాడిన ఇనుప కడ్డీల సామర్థ్యాన్ని జైయన్‌టీయూ (అనంతపురం)లో పరిశీలన కోసం పంపనున్నట్లు మునిసిపల్ ఇంజనీర్ సత్యనారాయణ తెలిపారు. నివేదిక రాగానే పనులను వేగవంతం చేస్తామన్నారు.

దాతలకు సర్టిఫికెట్ల ప్రదానం


సర్టిఫికెట్లను ఇస్తున్న వైద్యాధికారులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): పది మంది పేద క్షయ బాధితులకు పోషకాహార కిట్లను అందజేసిన దాతలను వైద్యాధికారి డా.వినోద్ కుమార్ అభినందించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి, తేజేశ్వర్ గౌడ్, పరశురాం, విజయ్, రమాదేవి, శశికళ, కృష్ణవేణి, జ్యోతి, వరలక్ష్మి, అరుణ అయిదు నెలలపాటు అందజేసినందుకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవోటీసీ డాక్టర్ శేఖర్, అనిల్ సాగర్, సూపర్‌వైజర్లుబాబురాజు, ఇందిరా దోరతి, భాస్కర్, సుబ్బమ్మ బాయి పాల్గొన్నారు.

సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్టేట్ బ్యాంక్ ఉద్యోగులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు చంద్రశేఖర్, మధు అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్ఆర్ లేబర్‌కాని పురపాలక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం రవి, వీర చంద్రయాదవ్, గిడ్డ రెడ్డి, శ్రీనివాసులు, మహేశ్వరి, శ్రీరాములు, చక్రపాణి, హనుమంతు, బ్రహ్మానందరెడ్డి, నాగరాజు స్వామి పాల్గొన్నారు.

నేత్రదానంతో చిరంజీవులు


సంచార చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి

వెల్దుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నేత్రదానంతొ చిరంజీవులుగా నిలవాలని నోడల్ అధికారి రఘురామరాజు సూచించారు. గురువారం మల్లెపల్లి గ్రామంలో సంచార చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశారు. మరణించిన వ్యక్తి నేత్రాలు 6 గంటల్లోపు అందజేస్తే ఇద్దరికి చూపు వస్తుందన్నారు. సెప్టెంబరు 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల వారు 9849903116, 9640692299 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. వైద్యులు నవీన్, ఆరోగ్య అధికారి గంగావతి, ఆరోగ్య కార్యకర్త సుబ్బలక్ష్మమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి బస్సు నడపాలి


వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌వో నాయకుడు తిరుమలేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ డిపో వద్ద ఆందోళన నిర్వహించారు. సమయానికి బస్సు రాకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజేష్, మల్లిస్వామి, సమర్థ జగదీష్ పాల్గొన్నారు.

పెచ్చులూడిన గదిని మూసివేయండి


గదిని పరిశీలిస్తున్న ఎంఈవోలు

ఆలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెచ్చులూడిన తరగతి గదులను తక్షణమే మూసివేయాలని ఎంఈవోలు కోమలాదేవి, చిరంజీవిరెడ్డి ఆదేశించారు. పట్టణంలోని 4వ వార్డు ఎంపీపీ పాఠశాలలో పైకప్పు పెచ్చులూడి ముగ్గురు విద్యార్థులు గాయపడటంపై ఎంఈవోలు విచారణ చేశారు. పెచ్చులూడిన గదిని పరిశీలించారు. మండలంలో ఇంకా ఏ పాఠశాలల్లో ఇలా ఉందో తెలపాలని హెచ్ఎంలను కోరామన్నారు. తెలిపారు. ఇకపై ఈ గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టొద్దని సూచించారు.

క్షుద్ర పూజల కలకలం

వెల్దుర్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని క్షుద్ర పూజలు చేయడంతో కలకలం రేగింది. వివరాల మేరకు.. పాతబస్టాండ్ వద్ద జడ్పీ బాలుర ఎదురుగా ఉన్న వీధిలో ఆదిత్య క్లినిక్ యజమాని ఆదినారాయణ గురువారం ఉదయం క్లినిక్ తెరవడానికి వెళ్లగా కుంకుమ, నిమ్మకాయలు, కోడిగుడ్లు దర్శనమిచ్చాయి. దీంతో నిర్వాహకుడు ఆందోళన చెందాడు.

9న ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న పత్తికొండ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి రైతులకు అన్నారు. గురువారం స్వగృహంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. ఉల్లి రైతులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పట్టణంలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ధర్నా చేస్తామన్నారు. రైతులు, వైసీపీ కార్యకర్తలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీరంగడు, సోమశేఖర్, ఎంపీపీ నారాయణదాస్, మండల కన్వీనర్ నాగరాజు, మైనార్టీ నాయకులు నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్‌లో ధ్రువీకరణ పత్రాలు

తుగ్గలి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దరఖాస్తుదారులకు వాట్సప్ ద్వారానే కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేయబడతాయని తహసీల్దార్ రవి తెలిపారు. గురువారం మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం శాశ్వత కులధృవీకరణ పత్రాలు వాట్సాప్‌లో ఇస్తారన్నారు. వీఆర్వో లేదా వీఆర్ఏకు ఆధార్, టీసీ, రేషన్ కార్డు కాపీలను ఇస్తే పత్రాలు అందుతాయన్నారు.

ఐటీఐ కళాశాలకు భవనం నిర్మించాలి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ఐటీఐ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, మైన మాట్లాడుతూ కళాశాలను 2008లో ఏర్పాటు చేశారని, సొంత భవనం లేకపోవడంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల-1 పాత భవనంలో కొనసాగుతుందన్నారు. భవనం శిథిలావస్థకు చేరి, పెచ్చులూడుతోందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. లక్ష్మీనారాయణ, నాయకులు మణి, శివ, సుధాకర్, డాకినాయక్, ఉపేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



ఉపాధ్యాయులను సన్మానించిన ఆవోపా సభ్యులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైదని ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా అన్నారు. గురువారం డీఎస్పీ బంగ్లా సమీపంలోని పురపాలక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం వెంకట రాముడు, ఉపాధ్యాయులు చక్రవర్తి తారదేవిని సన్మానించారు. కార్యదర్శి రఘు, కోశాధికారి వెంకటేశ్వర్లు, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమత శ్రీ, శ్రీదేవి, సంతోషి, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

తుగ్గలి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ ప్రతాపరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ప్రహ్లాదారెడ్డి సేవలు మరువలేనివని కేడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ అన్నారు. గురువారం తుగ్గలిలో వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. జడ్పీటీసీ సభ్యుడు పులికొండ నాయక్, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గిట్టా నాగేశ్ ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

దేవనకొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి దాడులు చేసి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్‌డెంట్ డి రామకృష్ణారెడ్డి, సీఐ సువర్ణలత తెలిపారు. వివరాల మేరకు.. బండపల్లి, బంటుపల్లి గ్రామాల్లో రూ.87 వేల విలువ చేసే 22.5 బాక్సుల కర్ణాటక మద్యాన్ని సీజ్ చేశారు. బండపల్లికి చెందిన ఈడిగ శ్రీనివాసులు, బేతపల్లి రామాంజినేయులు, బంటుపల్లి ఈడిగ చెన్నకేశవులు వీరికి సహకరించిన అలారుదిన్నే వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపగా మరొక్కరిని గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎస్‌లు రాజేష్, ప్రవీణ్‌కుమార్‌నాయక్, సిబ్బంది అయ్యన్న, లాలప్ప, కుమారస్వామి రెడ్డి ఉన్నారు.

రైతుల అభివృద్ధే సొసైటీ ధ్యేయం


మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు అప్పవేణు

తుగ్గలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే సొసైటీ ధ్యేయమని సొసైటీ అధ్యక్షుడు అప్పవేణు, సూపర్‌వైజర్ రామకృష్ణ అన్నారు. గురువారం ఉప్పర్లపల్లిలో మాట్లాడుతూ రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామన్నారు. సకాలంలో చెల్లించిన రైతుల నుంచి అదనపు వడ్డీ వసూలు చేయమన్నారు. రుణాలను రెన్యూవల్ చేసుకోకుంటే అదనపు వడ్డీ పడుతుందని, మొండిబకాయిలుగా పరిగణించి, కొత్త రుణాలు మంజూరు కావన్నారు. సీఈవో గిడ్డయ్య, కర్క్ నాగరాజు తదితరులు ఉన్నారు.

ఆఫీసులో ఉండేవారు ఉత్తమ ఉపాధ్యాయులా?

- ఎంఈవోపై ఎస్టీయూ నాయకుల ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంఈవో రమేష్

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్యాలయంలో పనిచేసే వారిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎలా ఎంపిక చేశారని మండల విద్యాధికారులను ఎస్టీయూ నాయకులు నిలదీశారు. గురువారం కార్యాలయంలో ఎంఈవోలు రాజారామ్మోహన్‌రావు, రమేష్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి సన్మానం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే నాయకులు మాట్లాడుతూ పాఠశాలలకు వెళ్లి చదువు చెప్పే ఉపాధ్యాయులను ఎంపిక చేయాలన్నారు. అలా కాకుండా ఎంఈవో ఆఫీసుకు పరిమితమైన ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎలా అవుతారని కొప్పటి నారాయణ, బలరాముడు, చెన్నకేశవులు, వెంకటేశ్వర్లు మండిపడ్డారు. స్పందించిన ఎంఈవో రమేష్ అది తన ఇష్టమని సమాధానమిచ్చారు. దీంతో ఎస్టీయూ నాయకులు ఇప్పటికైనా ఎంఈవోలు ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక విషయంలో తీసుకున్న నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో వారి విధానాలను ఎండగడతామని హెచ్చరించారు.

జయశంకరస్వామికి కన్నీటి వీడ్కోలు



నివాళి అర్పిస్తున్న నాయకులు

నందవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూలచింత గ్రామంలో బండేగురు మఠం పీఠాధిపతి జయశంకరస్వామి బుధవారం శివైక్యం కావడంతో గురువారం అంతిమయాత్రకు వేలాది మంది పూలచింత గ్రామానికి తరలివచ్చారు. తెలంగాణా, ఆంధ్రా, కర్ణాటక ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో వారి రోధనలతో పూలచింత శోక సంద్రంలో మునిగిపోయింది. టీడీపీ సీనియర్ నాయకులు, సర్పంచ్ బండేగురుస్వామి తండ్రి జయశంకరస్వామి ఆధ్యాత్మిక గురువు కావడంతో ఎంతో మంది శిష్యులను ఆధ్యాత్మికబాటలో నడిపించారు. దీంతో ఆయన భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు, ఈరన్నగౌడు, రైస్‌మిల్ నారాయణరెడ్డి, భార్గవ్‌యాదవ్, వీరారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ డీపీ రాముడు, ధర్మాపురం గోపాల్, నదికైరవాడి వీరేష్, ఆదిశేషు, టీజేపీ నాయకులు గురురాజారావు, వైసీపీ నాయకులు శివారెడ్డి గౌడు, గడ్డం నారాయణరెడ్డి, జనసేన నాయకులు యల్లప్ప నివాళి అర్పించారు.

'దాడి చేయడం దారుణం'

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణంలో నిర్దేశించిన మార్గంలో కాకుండా వేరే మార్గంలో మళ్లించిన ఆటో డ్రైవర్ అశోక్, డీజే ఆపరేటర్ రంగస్వామిపై సీఐ దాడి చేయడం దారుణమని, మానవ హక్కుల వేదిక, మాలమహానాడు తీవ్రంగా ఖండిస్తోందని నాయకులు శ్రీనివాసులు, ఉరుకుందప్ప, దేవేంద్రబాబు, నరసన్న, అడ్వకేట్ చెన్నయ్య అన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో జూలై 31న వినాయక నిమజ్జనం సందర్భంగా ఆటో డ్రైవర్, డీజే ఆపరేటర్‌లపై సీఐ దాడి చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సంఘటనపై హెచ్ఆర్ఎఫ్, మాల మహానాడు సంయుక్తంగా నిజనిర్ధారణ బృందంగా ఏర్పడి బాధితులను, పోలీసు అధికారులను కలిసేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వం స్పందించి సంఘటనపై విచారణ బాధ్యుడైన సీఐ శ్రీనివాసులును వెంటనే విధులనుంచి తొలగించి బాధితులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

గోనెగండ్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం పోరాటం చేస్తామని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పవన్‌తేజ, నాయకులు వినయ్ అన్నారు. గురువారం గోనెగండ్లలో ఎస్ఎఫ్ఐ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6న విజయవాడలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కార్తీక్, అన్నమయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని మైనార్టీ కాలనీ సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు కో-ఆర్డినేటర్ కాశింవలి డిమాండ్ చేశారు. గురువారం మైనార్టీ కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు మైనార్టీ కాలనీలోని ప్రజా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. కనీస వసతులు కూడా కల్పించలేదన్నారు. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి మైనార్టీ కాలనీలోని సమస్యలను పరిష్కరించి ప్రజల కష్టాలను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హాసిఫ్, హజరత్‌వలి, షబ్బీర్, షాకిర్, అజయ్ పాల్గొన్నారు.

ముగిసిన ఎల్ఐసీ వారోత్సవాలు



డీవో తిమ్మారెడ్డిని సన్మానిస్తున్న ఏజెంట్లు, ఎల్ఐసీ సిబ్బంది

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ప్రపంచ బీమా రంగంలోని అగ్రగామి సంస్థల్లో ఎల్ఐసీ మూడో స్థానంలో ఉందని యునియన్ బ్యాంకు మేనేజర్ రంగస్వామి, ఎల్ఐసీ మేనేజర్ పులినాయక్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఎల్ఐసీ ఉద్యోగ, ఏజెంటు సంఘాల పోరాటంతో ఎల్ఐసీపై జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. 'ఏజెంట్లు సంస్థకు మూలస్తంభాలని, సంస్థ బాగుంటేనే అందరం బాగుంటామని సంస్థ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నా'రు. కార్యక్రమంలో డీవోల డివిజన్ అధ్యక్షుడు పాటిల్ తిమ్మారెడ్డి, ఏబీఎం సంతోష్ కుమార్, ఉద్యోగసంఘాల నాయకులు విజయ్ కుమార్, సుధాకర్ రావు, లియాఫి కార్యదర్శి జయన్న, సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

కౌతాళం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి ప్రభుత్వం నూతన పాలక మండలి ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. దరఖాస్తుల పరిశీలనను ఆలయ ఈవో వాణి ఆధ్వర్యంలో ఆలయ కార్యాలయంలో దరఖాస్తుదారుల ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. పాలక మండలి ఏర్పాటుకు 62 మంది దరఖాస్తు చేసుకోగా వారి పత్రాల పరిశీలనకు 58 మంది హాజరైనట్లు తెలిపారు. మరో నలుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధిలో తమ వంతు సహాయ సహకారాలు అందించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములమవుతామని అభ్యర్థులు తెలిపారు. త్వరలో దరఖాస్తు పత్రాలను దేవదాయ శాఖకు పంపుతున్నట్లు ఈవో వాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు వెంకటేశ్వర్లు, కిరణ్, కుమార్ ఉన్నారు.

నిధులు లేక నిలిచిన జంబో షెడ్డు

● నాలుగేళ్లుగా అసంపూర్తిగా నిర్మాణం ● చేతులెత్తేసిన కాంట్రాక్టర్ ● వర్షాకాలంలో రైతుల అవస్థలు



వ్యవసాయ మార్కెట్ కమిటీలో అసంపూర్తిగా ఉన్న జంబో షెడ్డు



ఎండకు వానకు తడవాల్సిందే



షెడ్డు లేకపోవటంతో మార్కెట్‌లో ఆరుబయటే వేరుశనగను కాటాలు పడుతున్న దృశ్యం

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులు తీసుకొచ్చే పంట ఉత్పత్తుల సౌకర్యార్థం వైసీపీ ప్రభుత్వంలో జంబో షెడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే పాలక ప్రభుత్వాలు సకాలంలో నిధులు విడుదల చేయక పోవటంతో జంబో షెడ్డు నాలుగేళ్లుగా అసంపూర్తిగా మొండిగోడలకే పరిమితమైంది. దీంతో మార్కెట్‌కు పంట ఉత్పత్తులను తీసుకొచ్చే రైతులు వర్షాకాలంలో నానా అవస్థలు పడుతున్నారు.

నాలుగేళ్ల క్రితం రూ. 2.50 కోట్లతో: వ్యవసాయ మార్కెట్ కమిటీలో 2021లో రూ. 2.50కోట్లతో జంబో షెడ్ (గాల్వాల్యూమ్ షెడ్) నిర్మించేందుకు అప్పటి వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవటంతో నిర్మాణం కాస్త అసంపూర్తిగా ఉండిపోయింది. వైసీపీ ప్రభుత్వ హాయంలో కేవలం రూ. 90లక్షలు నిధులు మాత్రమే విడుదల కావటంతో కాంట్రాక్టర్ అక్కడి వరకు పనులు చేసి అటు తరువాత చేతులెత్తేశాడు. ఇంకా విడుల కావాల్సిన నిధులు రూ. 1.60కోట్లు విడులు కాకపోవటంతో పనులు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో వైసీపీ ప్రభుత్వంలో పనులు అసంతపూర్తిగా వదిలేశారు. 2024లో రాష్ట్రంలో ప్రభుత్వం మారి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో కొత్త ప్రభుత్వంలోనైన నిధులు మంజూరు అవుతాయనుకుంటే ప్రస్తుత ప్రభుత్వం కూడా షెడ్డు నిర్మాణంపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. దీంతో నాలుగేళ్లుగా జంబో షెడ్ అసంపూర్తిగా దర్శనమిస్తోంది.

ఇబ్బంది పడుతున్న రైతులు : మార్కెట్‌కు పంట ఉత్పత్తులను తీసుకొచ్చే రైతులు ముందుగా వచ్చిన వారు కమీషన్ ఏజెంట్ల దుకాణాల ముందు నరుకును అమ్మకానికి ఉంచుతారు. కొంత ఆలస్యంగా వచ్చిన రైతులు మార్కెట్‌లో ఆరుబయటే అమ్మకానికి ఉంచాల్సిన పరిస్థితి. వర్షాకాలం, వేసవి కాలం సీజన్‌లో ఒక్కోరోజు దాదాపు 10నుంచి 15వేలకు పైగా బస్తాల వేరుశనగ, ఆముదాలు, శనగలు, కందులు అమ్మకానికి వస్తాయి. జంబో షెడ్ అసంపూర్తిగా ఉండటంతో చేసేది లేక రైతులు ఆరుబయట సరుకును అమ్మకానికి పెడతారు. అదే జంబోషెడ్ పూర్తి అయి ఉంటే దాదాపు ఐదు వేల బస్తాలు వేరుశనగ షెడ్డులో అమ్మకానికి ఉంచే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వర్షానికి పంట ఉత్పత్తులు తడిసిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తడిసిన పంట ఉత్పత్తులను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆరుబయట అమ్మకానికి ఉంచిన సరుకు వర్షానికి తడవకుండా ఉండేందుకు తార్పాళ్లు సైతం అరకొరగానే అందుబాటులో ఉన్నాయి. దీంతో రైతులు అధికారులపైన, పాలకులపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జంబో షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

● నిధుల కోసం నివేదించాం

మార్కెట్ కమిటీలో అసంపూర్తిగా ఉన్న జంబో షెడ్డు నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సైతం నిధుల మంజూరుకోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

చంద్రమౌళి, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీ మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథం పై విహరించారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన బాద్రపద ద్వాదశి గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణలు మంగళ వాయిద్యాల, విద్యుత్ దీపాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతి మంగళహారతుల అనంతరం ఆలయ ప్రాంగణం చుట్టూ అంగరంగా వైభవంగా ఊరేగించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర జడ్జి జస్టిస్ ఉమాదేవి కుటుంబ సమేతంగా ఆదివారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు.

కిక్కిరిసిన భక్తులు: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. రాఘవేంద్రస్వామికి ఇష్టమైన గురువారం కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు రావడంతో మఠం అతిథి గృహాలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది.

'రైతులను ఆదుకోవడంలో విఫలం'



మాట్లాడుతున్న సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, భీమిరెడ్డి, పురుషోత్తంరెడ్డి

మంత్రాలయం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు అందించటంలో, అలాగే రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమయిందని మంచాల సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మంత్రాలయం వైసీపీ మండల అధ్యక్షుడు గుర్రెడ్డి భీమిరెడి అన్నారు. గురువారం ఎమ్మిగనూరు భీమా నిలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశానికి కౌతాళం, మంత్రాలయం, పెద్దకడబూరు నాయకులు ప్రహ్లాదాచార్, రామ్మోహన్‌రెడ్డి, వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు రవిచంద్రరెడ్డి, కౌతాళం ఎంపీపీ అమ్రేష్ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతంటే రైతుల కష్టాలు కూటమి ప్రభుత్వం ఏమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సమావేశంలో వైసీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు కరణం గురురాజరావ్, వెంకట్రామిరెడ్డి, మహేంద్రరెడ్డి, జెట్టివీరేష్, మేకల నరాయణ, మజ్జిగబొజ్జప్ప, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

'ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జేఏసీ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా గురువారం విద్యార్థి సంఘాల నాయకులు ఉదయ్, ఆఫ్రిది, రఘు మాట్లాడుతూ పాఠశాలలో అర్హత లేని ఉపాధ్యాయులచే బోధనలు జరుగుతున్నాయని, సరైన వసతులు లేకపోయినా విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. అదే విధంగా బస్సులకు వ్యాన్లకు సరైన ఫిట్నెస్ లేకుండా పరిమితికి మించి విద్యార్థులను తరలించడం జరుగుతుందన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారాన్నారు. కార్యక్రమంలో కృష్ణ, ఖాజా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక



మల్లన్న, మంత్రాలయం



రామమోహన్, మాధవరం.



ఆర్. సురేష్ గోనెగండ్ల



బసవరాజు గాజులదిన్నె



శోభాదేవి, ఎర్రబాడు



దుర్దానపర్వీన్ గోనెగండ్ల

మంత్రాలయం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ అధ్యాపకులుగా ఈ. మల్లన్న జిల్లా ఉత్తమ అధ్యాపకులుగా, మంత్రాలయం మండలంలోని మాధవరం ప్రాథమిక (మెయిన్) పాఠశాల హెచ్ఎం మిరియాల రామమోహన్‌లు ఉత్తమ జిల్లా ఉపాధ్యాయులుగా ఎన్నికైయ్యారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కర్నూల్ జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, డీఈఓ శ్యాముల్‌పాల్, ఆర్‌జేడీ సురేష్‌బాబు చేతులమీదుగా అవార్డులు అందుకోనున్నారు.

గోనెగండ్ల: ఈ ఏడాది గోనెగండ్ల మండలం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురు ఎంపికైనట్లు ఎంఈవో నీలకంఠప్ప తెలిపారు. గోనెగండ్లలో నిజులదిన్నె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బసవరాజు, ఎర్రబాడు గ్రామంలో పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శోభాదేవి, గోనెగండ్ల బస్టాండ్ స్కూల్ లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న దుర్దానపర్వీన్‌లు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అలాగే గోనెగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిస్టరీ లెక్చరర్ పనిచేస్తున్న సురేష్ ఉత్తమ లెక్చరర్‌గా ఎంపియ్యారు.. శుక్రవారం కర్నూలు కలెక్టర్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియం లో జిల్లా కలెక్టర్ అవార్డు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు.

కౌతాళం: మండల పరిధిలోని బదినేహల్ గ్రామ ఎంపీపీ కన్నడ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ జ్యోతిని ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు. ఇంటర్మీడియట్‌లో కౌతాళంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీవశాస్త్రం అధ్యాపకుడు సంతోష్ కుమార్‌ను ఉత్తమ అధ్యాపడిగా ఎంపిక చేశారు.



సంతోష్ కుమార్, కౌతాళం



అరుణజ్యోతి, కౌతాళం

కమిటీ ఎన్నికను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అంబేడ్కర్ భవన నిర్మాణ సాధక కమిటీ ఎన్నికను జయప్రదం చేయాలని బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ భవన నిర్మాణనికి స్థలం కేటాయించారు గాని భవన నిర్మాణం ఇంత వరకూ జరగలేదు, అందుకుగాను ప్రశ్నించే గోంతుకగా పూలే, అంబేద్కర్ భావాలు కలిగినటువంటి వారు ప్రతి ఒక్కరూ పాల్గొని సాధక కమిటీని జయప్రదం చేసి ప్రతిభావంతుడైన ఛైర్మన్‌ను ఎన్నుకోవాలని కోరారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మాల నరసప్ప పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

నందవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు రూరల్ సీఐ మధుసూధన్‌రావుకు డీఎస్పీగా పదోన్నతి రావడంతో గురువారం నందవరం మండల పార్టీ కన్వీనర్ కాశీంవలి, మండల సహకార సంఘం అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు నదికైరవాడి వీరేష్, ఆదిశేషు, జనసేన మండల అధ్యక్షుడు యల్లప్ప సీఐకి శాలువ కప్పి సన్మానం చేశారు. నందవరం మండలానికి సీఐగా ఆయన చేసిన సేవలు మరవరానివి అన్నారు. గ్రామాల్లో గొడవలు లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు.

ఉల్లి పంటకు కనీస మద్దతు ధర కల్పించాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉల్లి పంటకు మద్దతు ధర రూ 3వేలు కల్పించాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు, తాలుకా నాయకుడు జయన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం నందు వారు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఉల్లి కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు. అనంతరం ఎమ్మార్వో శేషాఫణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు అనీఫ్, దావీదు, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

'చెత్త నుంచి సంపద' కేంద్రాల పరిశీలన

నందవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరంలోని చెత్త సంపద కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో పుల్లయ్య, డిప్యూటి ఎంపీడీవో సందీప్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సిబ్బందితో మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తలను వేరు వేరుగా ఉంచాలన్నారు. వర్మీ కంపోస్టు ఎరువు గురించి, నాన్ పీట్‌తో తయారు చేసే ఫ్రీ పోస్టు ఎరువుల గురించి వివరించారు.షెడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్మీ కంపోస్టు ఎరువు సకాలంలో రైతులకు అమ్మాలన్నారు. అలాగే నాగలదిన్నె గ్రామంలో పల్లెకు పోదాం పోగ్రాం గురించి గ్రా స్థాయి అధికారులతో సమావేశమై చర్చించారు.

ఉల్లి రైతు ఆవేదన

● రూ. 100కు ఏడు కేజీలు చొప్పున గ్రామాల్లో తిరిగి విక్రయిస్తున్నవైనం
● నష్టపోతున్న అన్నదాతలు



ఆటోలలో ఉల్లిని అమ్ముతున్న దృశ్యం



మూగజీవాలకు గ్రాసంగా వదిలిన ఉల్లి పంట

గోనెగండ్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటకు ప్రభుత్వం గిట్టు బాటు ధర రూ. 1200 ప్రకటించినప్పకీ చాలా మంది రైతులు గ్రామాలలోనే అమ్మకాలు జరుపుతున్నారు. మరి కొంత మంది రైతులు గోనెగండ్ల మండలంలో ఆటోలలో, ఎద్దుల బండ్లపై ఉల్లి బస్తాలను వేసుకోని రూ. 100 కు ఏడు కేజిల ప్రకారం వీధుల్లో అమ్మకాలు జరుపుతున్నారు. లక్షలు పెట్టు బడులుపెట్టి మార్కెట్ లో ధర లేకపోవడంతో కేజీల ప్రకారం చిల్లర గా అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మండలంలో దాదాపు 1000 ఎకరాలలో పంట సాగు చేశారు. వర్షం కారణంగా ఉల్లి రైతులు విలవిల లాడుతున్నారు. చేతికి అందిన పంట వర్షానికి కుళ్లి పోతోందని వారు ఆవేదన చెందుతున్నారు. కర్నూలు మార్కెట్‌లో క్వింటం ఉల్లి రూ. 1200 పలుకుతుంది. ఇక తాడేపల్లి గూడేంలో దాదాపు ఇదే ధరనే ఉండటంతో తాడేపల్లి గూడేంకు ఉల్లి పంటను లారీ లో వేసుకిని అమ్మకాలు జరిపి రావాలంటే రవాణా ఖర్చులు దాదాపు రూ. 25000 పలుకుతుంది. దీంతో ఉల్లి రైతులు వెళ్లలేని పరస్థితి దీంతో చేసేది లేక మార్కెట్‌లో అమ్మలేక గ్రామాల్లోని వీధుల్లో ఆటోలలో కేజీల ప్రకారం అమ్మకాలు జరుపుతున్నారు. ఇప్పటికే మండలంలోని చాల మంది రైతులు ఉల్లి పంటను పశుగ్రాసంగా వదిలేశారు. గ్రామానికి సమీపంలో ఉల్లి పొలాలో వదిలివేసిన ఉల్లి పంటను గ్రామస్థులు వెళ్లి ఉచితంగా తీసుకెళ్తున్నారు.

అధిక వర్షాలకు ఉల్లి కుళ్లిపోయింది



ఈ ఏడాది ఎన్నడు లేని విధంగా అధిక వర్షాలు కురుస్తున్నాయి దీంతో సాగు చేసిని పంట మొత్తం వర్షంలో కుళ్లి పోయింది. ఎకరన్నర ఉల్లి సాగు చేశాను దాదాపు రూ. 80 వేల పెట్టుబడి అయింది. మొత్తం నష్టం వచ్చింది. రైతుల చాల మంది గ్రామాల్లో తిరిగి కేజి ప్రకారం చిల్లర అమ్మకాలు జరుపుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి.

ఉరుకుందరెడ్డి, ఉల్లి రైతు, వేముగోడు